క్లుప్తంగా

పనుల్లో వేగం పెంచాలి



సాక్షి ఎఫెక్ట్..

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, అధికారులకు డీఈఓ రామారావు సూచించారు. బుధవారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన 'పనులు పూర్తియ్యేనా' కథనానికి డీఈఓ స్పందించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ రాములు ఆధ్వర్యంలో పనుల పురోగతిపై సమీక్షించారు. నత్తనడకన నడుస్తున్న పాఠశాలల్లో పనులు వచ్చే నెల 7లోపు పూర్తి అయ్యేవిధంగా పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీల చైర్మన్లు, హెచ్‌ఎంలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, సీఆర్‌పీలు, మెస్సెంజర్లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బయ్యారం: అయ్యప్పదీక్షాపరుల మండల అధ్యక్షుడిగా బయ్యారానికి చెందిన పెద్దినేని వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. బుధవారం బయ్యారంలోని రామాలయం ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడు తాటికొండ మధుకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దూదిమెట్ల మోహన్‌రావు, కోశాధికారిగా గుంజ వీరస్వామితోపాటు పలువురు సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గురుస్వామి శ్రీనివాసాచారి, దీక్షాపరులు రామకృష్ణ, శ్రీను, రవి, శివ, సుమన్, ముని, బాలు, తదితరులు పాల్గొన్నారు.

వీధులు నిర్మానుష్యం



డోర్నకల్: తీవ్రమైన ఎండతో బుధవారం వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 9గంటల నుంచే ఎండతీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఎండతో అవస్థ పడ్డారు.

చెరువు హద్దుల పరిశీలన



దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో గల పెద్ద చెరువును ఎస్సారెస్పీ డీఈ వినయ్‌కుమార్, ఏఈ మౌనిక, సర్వేయర్ శ్రీనిత్యతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుకు హద్దులు కావాలని గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. వచ్చే నెల 7న పూర్తిస్థాయి హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



కురవి: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



గార్ల: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



పెద్దవంగరలో..



నెల్లికుదురులో..



బయ్యారంలో..



దంతాలపల్లిలో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలు సంఘ కార్యాలయంలో బుధవారం జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రమేష్, ఉపేందర్, విష్ణువర్ధన్, ఉపేందర్, విద్యాసాగర్, సత్యం, అంజయ్య, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, ఉప్పలయ్య, శ్రీనివాస్, మోహన్, బాలచందర్ పాల్గొన్నారు.

కురవి: టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, ఆగిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పూస ఎల్లయ్య, గుండ్ల విజయ్‌కుమార్, ఓడెల శివకుమార్, దైద వెంకటేశ్వర్లు, సింగం మనోహర్, గుగులోత్ వెంకన్న, వీరభద్రం, భిక్షపతి, శీలం వెంకటరాజు, బండెల బాలరాజు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాలలను తెరిపించాలి

పెద్దవంగర: మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య అన్నారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయంలో సంఘం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్, ప్రధాన కార్యదర్శి దారావత్ దేవేందర్, సూరాం ఉపేందర్, కోట మురళి, కోట వెంకటేశం, బోగ సురేందర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి మహ్మద్ మెహబూబ్ అలీ, సంఘం బాధ్యులు రవి, రాజశేఖర్, నర్సయ్య పాల్గొన్నారు.

నెల్లికుదురు: మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.బాలు, సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సంఘం జెండా ఎగురువేశారు.

గార్ల: టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం గార్లలో సంఘం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు శీలంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి జి. బాలాజీనాయక్, ఎం.రాములు, సామానాయక్, వజ్రం నాగేశ్వరరావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను బుధవారం బయ్యారంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను జిల్లా కార్యదర్శి కొమిరె ఉప్పలయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మీరా, ప్రవీణ్, రమేష్, రవిందర్, కిషన్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో సంఘం జెండా ఆవిష్కరించారు.



గూడూరులో..

ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా మాజీ కార్యదర్శి సూరం ఉపేందర్ రెడ్డి, యాకయ్య, రామలింగం పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాలు పెంపు

మహబూబాబాద్ అర్బన్: ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చని జీవవైవిధ్య పరిరక్షణ కమిటీ సభ్యుడు దైద వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంకుడు గుంతలు నిర్మాణ ఉపయోగంపై వాకర్స్‌తో ర్యాలీ నిర్వహించి మొక్కలను నాటారు. ఈసందర్భంగా దైద వెంకన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కటు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. చెట్లు మానవళికి ప్రాణవాయువు అందిస్తాయన్నారు. మొక్కలు నాటి బావితరాలకు కానుకగా అందించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరసింహారావు, మల్లేశం, వెంకటయ్య, వాకర్స్ పాల్గొన్నారు.

ఇసుక అనుమతులు రద్దు చేయాలి

దేవరుప్పుల: ఇసుక అనుమతులను సత్వరమే రద్దు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక అవసరాలైన పేదలు ఇళ్లు నిర్మించుకుంటే ఇసుక రవాణాకు అడ్డంకులు కల్పించొద్దన్న కొత్త నిబంధనలు ఆసరా చేసుకొని ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లకు దోచిపెట్టేలా ఇలాంటి ఇసుక తవ్వకాల అనుమతులు ఇవ్వడం తగదన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఇక్కడి ఇసుక తరలించాల్సిన అవసరం తమకు లేదన్న స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు రైతులకు నష్టం వాటిల్లే ఇసుక అనుమతులను ఎందుకు నిలువరించడంలేదని విమర్శించారు. ఈ విషయంలో వామపక్షపార్టీలు మౌనంగా ఉండడం విచారకరమన్నారు. అనుమతులు రద్దు చేయకుంటే రైతు ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

అంబర్, గుట్కాల స్వాధీనం

మహబూబాబాద్ రూరల్: అంబర్లు, గుట్కాలు, ఇతర పొగాకు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆరు బస్తాల అంబర్లు, గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య, టాస్క్ ఫోర్సు సీఐ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని పలు పాన్ షాపులు, కిరాణా షాపుల్లో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి సుమారు రూ.66వేల విలువ చేసే గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సీహెచ్ నగేష్ హెచ్చరించారు.

డోర్నకల్: స్థానిక మెయిన్ రోడ్డులో బుధవారం పోలీసులు పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మెయిన్ రోడ్డులోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కాలను విక్రయిస్తున్న కాపర్తి



మహబూబాబాద్ రూరల్: పోలీసులు స్వాధీనం చేసుకున్న అంబర్ ప్యాకెట్లు

బోయిన కిశోర్, లక్ష్మణ్, అనేష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొత్తగూడ: మండలకేంద్రంలోని కిరాణ షాపులపై గూడూరు సీఐ బాబూరావు ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిషేధిత గుట్కా, అంబర్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట కొత్తగూడ ఎస్సై దిలీప్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రెండు లక్షల రుణమాఫీ, పంట బోనస్ ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని సంఘం సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేసి రైతాంగాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లోకి రాకుండా అరికట్టాలన్నారు. విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీతో నేరుగా రైతులకు అందించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఉప్పరబోయిన రామ్మూర్తి, ఎస్‌కె.మధార్, దొంతోజు ఉపేందర్, కందగట్ల ఉపేందర్, అరేం కోటమ్మ, కేదాసు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

మరిపెడ రూరల్: ప్రస్తుతం వానాకాలం పంటల సాగుకు విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ సహాయ అధికారిని (ఏఈఓ) శ్వేత సూచించారు. మండలంలోని ఉల్లెపల్లి, దంటకుంటతండా, భూక్య తండా గ్రామ పంచాయతీ పరిధిలో రైతులకు అవగాహన సదస్సులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పెద్దబోయిన శ్రీను, గుగులోతు నర్సింగ్ నాయక్ పాల్గొన్నారు.

డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి

మహబూబాబాద్ రూరల్: రైతులు అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని ఉత్తర తండా జీపీ పరిధిలోని నేతాజీ తండాలో విత్తన దుకాణాల్లో బుధవారం రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి, ఏఓ ఎస్.తిరుపతిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. విత్తన దుకాణాల్లో నిల్వ ఉన్న మిరప, పత్తి విత్తనాల ప్యాకెట్లపై ఉన్న ఎమ్మార్పీ ధర, కంపెనీ పేరు, తయారీ తేదీ, లాట్ నంబరు విషయాలను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మహబూబాబాద్ రూరల్: తనిఖీ చేస్తున్న ఎస్సై దీపికరెడ్డి, ఏఓ తిరుపతిరెడ్డి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

గార్ల: విత్తన దుకాణాల్లో డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే, సదరు దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు హెచ్చరించారు. బుధవారం గార్లలోని పలు విత్తన దుకాణాలను ఆయన స్థానిక ఎస్సై ఎస్.జీనత్‌కుమార్‌తో కలసి ఆకస్మిక తనిఖీ చేసి దుకాణంలో స్టాక్ రిజిస్టర్, విత్తనాల రశీదు బుక్స్‌ను పరిశీలించారు. గడువు తేదీ దాటిన విత్తనాలను విక్రయిస్తే సదరు డీలర్‌పై శాఖా పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కురవి: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై బి.గోపి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన డీలర్లతో సమావేశం మండల వ్యవసాయ శాఖ అధికారి మంజుఖాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన డీలర్లు రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో విత్తన డీలర్ల సంఘం నాయకుడు సల్లపు రవి, డీలర్లు ఉపేందర్, అవిరె దామోదర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షాపులను తనిఖీ చేపట్టారు.



మరిపెడ రూరల్: భూక్యతండాలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఏఈఓ శ్వేత

నెల్లికుదురు: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఏఓ నెలకుర్తి రవీందర్ రెడ్డి డీలర్లను హెచ్చరించారు. స్థానిక రైతువేదికలో బుధవారం ఎరువులు, పురుగుల మందుల డీలర్లకు ఏఈఓ వల్లంల ప్రవీన్‌తో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించే టప్పుడు కచ్చితంగా తీసుకున్న వాటి వివరాలను పూర్తిగా రశీదులో నింపి రైతు సంతకం తీసుకుని ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోకపోతే చర్యలు తప్పవన్నారు.

సంక్షిప్త సమాచారం

రూ.1.10లక్షల ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ మూరగుండ్ల అనంత రాములు అనారోగ్యానికి గురై వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు స్పందించిన గ్రామ మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి రూ.10వేలు, పలువురు గ్రామస్తులు కలిసి రూ.లక్ష మొత్తం రూ.1.10లక్షలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి, గండి శ్రీనివాస్, మోడెం వెంకటేశ్వర్లు, చింతనూరి చిన్నవెంకన్న, సుంకరి వెంకన్న, పాడేటి దినేష్, కొంతం శరత్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నగదు అందజేత

గూడూరు: మండల కేంద్రంలోని ముస్లిం వీధిలో ఇటీవలే మృతి చెందిన పులువురి పేద కుటుంబాలకు జిల్లా కాంగ్రెస్ ఆదేశాల మేరకు మండల నాయకులు బుధవారం బియ్యంతోపాటు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరం శ్రీపాల్‌రెడ్డి, నాయకులు రాసమల్ల యాకయ్య, చంటి స్వామి పాల్గొన్నారు.

అమరుల ఆశయాల సాధనకు పోరాడాలి

బయ్యారం: పీడిత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల ఆశయాల సాధనకు విప్లవ శ్రేణులు పోరాడాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. కాచనపల్లి, గొందిగూడెం అమరవీరుల వర్ధంతి సందర్భంగా బుధవారం బయ్యారంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కాచనపల్లి అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిర్వహించిన సమావేశంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భిక్షం, వీరభద్రం, రాకేష్, సంగన్న, యుగంధర్, బుచ్చయ్య, ఐలయ్య, మురళి, నాగేశ్వరరావు, సత్యం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి

గార్ల: ఎన్‌కౌంటర్లు ప్రభుత్వ హత్యలే అని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు అన్నారు. బుధవారం గార్లలో నిర్వహించిన కాచనపల్లి అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కాచనపల్లి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, మాన్యా, మంగయ్య, ప్రసాద్, శ్రీను, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కురవి: పెండింగ్‌లో ఉన్న మన ఊరు–మన బడి పనులను పూర్తి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల కన్వీనర్ సాయికుమార్ డిమాండ్ చేశాడు. బుధవారం మండలంలోని రాజోలు గ్రామంలోని హైస్కూల్‌లో సంఘం ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో ప్రకాశ్, కిరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

పరామర్శ..

మహబూబాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కేఎస్‌ఎన్ రెడ్డి మాతృమూర్తి కోడూరు రంగనాయకమ్మ ఇటీవల మృతి చెందగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట అయూబ్ పాషా, బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం



మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పారు. అయితే డంపింగ్ యార్డు మున్సిపాలిటీ కేంద్రంలోని కూన్యతండాకు సమీపంలో ఉండడంతో పొగలు వ్యాపించి స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఇక్కడి నుంచి డంపింగ్‌యార్డు ఎత్తివేయాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న మహిళ మృతి

డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంట గ్రామానికి చెందిన మహిళ పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. డోర్నకల్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రాలకుంట గ్రామానికి చెందిన భూక్యా కమిలి(55) కుటుంబ తగాదాల నేపథ్యంలో ఈనెల 25న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కమిలి పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ తెలిపారు.

నాంచారిమడూరులో వ్యక్తి..

తొర్రూరు రూరల్: జేసీబీతో చెట్లను తొలగిస్తుండగా చెట్టు మీద పడి తీవ్రగాయాలతో ఓ వ్యక్తి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. ఈనెల 28న మండలంలోని నాంచారిమడూరు గ్రామ శివారులో జేసీబీ వాహనంతో చెట్లు తొలగిస్తుండగా, జేసీబీ పక్కనే నిలబడి ఉన్న జాటోతు యాకన్న(42) అనే వ్యక్తిపై పెద్ద చెట్టు విరిగి పడింది. దీంతో యాకన్న తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంబంధిత జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

గుండెపోటుతో ప్రయాణికుడు..

మహబూబాబాద్ రూరల్: గుండెపోటుతో ప్రయాణికుడు మృతిచెందిన సంఘటన నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు మండల కేంద్రానికి చెందిన ముల్లా ముర్తుజా అబ్బాస్ (51) సికింద్రాబాద్ వెళ్లడానికి నర్సాపూర్ నుంచి నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లి కదలకుండా ఉండటంతో తోటి ప్రయాణికులు గమనించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైలు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు రాగానే జీఆర్పీ పీసీ శోభన్ బాబు, ఆర్పీఎఫ్ సిబ్బంది పరిశీలించి 108ద్వారా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతిచెందాడని ధ్రువీకరించారు. ఆ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం గదిలో భద్రపరిచి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉత్తర తండా జీపీ పరిధిలోని గుర్రాల గుట్ట తండాకు చెందిన బోడ భద్రు తన ద్విచక్ర వాహనంపై కురవి వైపు నుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో కురవి రోడ్డులోని ఆర్‌ఓబీపై నుంచి ఓ ద్విచక్ర వాహనం ఎదురు అతివేగంగా వచ్చి భద్రు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లింది. ఈప్రమాదంలో భద్రు తీవ్రంగా గాయపడగా సమాచారం అందుకున్న 108 పైలట్ ప్రశాంత్, ఈఎంటీ బంగారీ సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

కేసముద్రంలో ఒకరికి..

కేసముద్రం: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన మండలంలోని బోడమంచ్యా తండాజీపీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట పట్టణానికి చెందిన పి.నాగార్జున అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కేసముద్రం వైపునకు వస్తున్నాడు.. ఇదేక్రమంలో మానుకోట వైపునకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా బోడమంచ్యాతండా జీపీ సమీపంలోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న నాగార్జున తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108లో మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు.


ఇద్దరిపై కేసు నమోదు

గార్ల: అటవీ భూమిలోని హద్దురాళ్లను ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ బుధవారం తెలిపారు. వివరాలిలావున్నాయి.. గార్ల మండలం మద్దివంచ పంచాయతీలోని సర్వేనంబర్ 116లో గల అటవీ భూమి హద్దురాళ్లను కొత్తతండాకు చెందిన భావ్ సింగ్, వీరన్న ధ్వంసం చేశారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ రాందాస్ ఫిర్యాదు మేరకు పైఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తునికాకు కూలీకి పాము కాటు

కొత్తగూడ: తునికాకు కూలి పాము కాటుకు గురైన సంఘటన మండలంలోని రేణ్యతండాలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన బానోతు గంసీ తునికాకు సేకరించడానికి వెళ్లింది. ఆకుల చాటున ఉన్న పాము కాటు వేసింది. గంసీ అరవడంతో తోటి కూలీలు హుటాహుటిన తండాకు తరలించారు. 108కు సమాచారం ఇచ్చి నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని జ్యోతిబసునగర్‌లో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగుడు ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడు. వివరాలు.. బోడ కిషన్ తన ఇంటి ముందు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని నిలిపి ఉంచాడు. బుధవారం తెల్లవారుజామున లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైందని బాధితుడు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇంటి ముందు నిలిచిన వాహనాలు వరుసగా అపహరణకు గురవడంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పోలీస్ గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా విచారణ చేపట్టారు.